# ఆతిథ్యం

వేసవి అప్పుడే సగపడింది. ఎండలు మిక్కుటమైనాయి. పరమ శివుడు లలాటనేత్రం తెరిచాడేమో నన్నంత వెట్ట పుట్టింది లోకంలో. బూరుగు కాయలన్నీ చెట్లనే పగిలిపోతున్నాయి. ఎండమావుల్ని చూసి మృగ సమూహాలు పరుగులు తీస్తున్నాయి. అడవుల్లో కార్చిచ్చులు చెలరేగుతున్నాయి. సరస్సుల్లో చెరువుల్లో దొరువుల్లో కొంగల మోకాలి బంటి మాత్రమే నీళ్ళు మిగిలాయి. వరిమడులన్నీ బీటలు వారాయి. పడమటి గాలులు బాటసారులను బహూ బాధిస్తున్నాయి.

భూమండలానికే మండనాయమానమైంది చోళదేశం. గుళ్ళూ గోపురాలు, ఆరామ తటాకాలు, టెంకాయ తోపులు, రమా నటీ నర్తన రంగశాల చోళభూమి. అయితేనేం, ఎండలు మెండుగా ఉన్నాయి.

కార్పాసికారామం చిన్న వూరు. అయినా చోళ దేశమనే పాపిట పిందెలచేరుకది రత్నం వంటిది.

ఈ వూళ్ళో వరదార్యుడు వైష్ణవోత్తముడు. వేద వేదాంగాలు ఆయన వశమైనాయి. బహు నిష్ఠాపరుడు. శ్రీనివాస పదాబ్జ సేవానిరతుడు. మిక్కిలి సదాచారుడాయన. ఆ వూళ్ళో ఆయన ఒక పూరింటిలో నివసిస్తూ ఉన్నాడు. చుట్టుపక్కల నాలుగు వూళ్ళూ తిరిగి ప్రతిరోజూ యాయవారంవల్ల లభించిన పదార్థాలు మాత్రమే పరిగ్రహిస్తాడు. మరి ఆయనకు కోరికలు లేవు. విష్ణు పూజ ఆయన ఉచ్వాస నిశ్వాసాలు. ఉంఛవృత్తి జీవనోపాధి.

ఆయన ఇల్లాలు లక్ష్మిదేవి. సాక్షాత్తూ శ్రీమహాలక్ష్మి వంటి రూప సౌందర్య వైభవోపేతురాలామె. ఆమెకు పద్దెనిమిదేళ్ళిప్పుడు. జంగమ

హేమవల్లి ఆమె. ద్రావిడ ప్రబంధాలన్నీ ఆమెకు వాచో విధేయాలు. ఆమె గుణ సంపదను దేవతలు కూడా మెచ్చుకుంటారు. సద్వైష్ణవ సంప్రదాయం ఆమెలో మూర్తీభవించింది. పతి ఆమెకు ఆరో ప్రాణం. భగవత్ భాగవత ఆచార్య పూజనంలో ఆ పద్మపత్రాయతాక్షికి ఆమెకి ఆమే సాటి. సంపదలపై ఆమెకేమీ ధ్యాస లేదు. నిత్య తృప్తురాలామె. లోకంపట్ల నిర్లిప్తురా లామె.

చుట్టూ ఆవరణలో చెట్లు. మధ్య చిన్న పూరిల్లు. ఆవరణలో చిన్న చిన్న రాతి తిన్నెలు ఉన్నాయి. పూరింటి మీదికి కాశీరత్నం తీగె పాకి గుత్తులు గుత్తులుగా పూలు పూసింది. శ్వేత ద్వీపపు ఎండలో ఇల్లొక పగడాల దీవిలా ఉంది. ఇల్లంతా గోమయంతో అలికి చక్కని ముగ్గులు పెట్టి ఇంట్లో పనిపాటలు చూసుకుంటున్నది ఇల్లాలు. సూర్యుడు రెండు బారలైనా పైకి సాగాడో, లేదో మిటమిటలాడు తున్నది ఎండ వెండి కరిగిపోతున్నట్లు.

వరద దేశికుడు సమీప గ్రామాలు నాలుగూ చుట్టి రెండు జాము లకు కాని రారు. ఉన్న ఒక్క మంచి బట్టా మడికి ఆరేసి లక్ష్మీదేవి ఒక చిరుగుల బట్ట కట్టుకొని బయట వాకిలి తలుపు బంధించి లోపల ఏదో పని చేసుకుంటున్నది.

ఇంతలో తలుపు దగ్గర చప్పుడైంది. చాలా మంది గుంపుగా వచ్చినట్లు పదధ్వని చెపుతున్నది. ఇంటి యజమాని లేని విషయం వారు గ్రహించారు. గ్రహించారంటే ఎలాగు గ్రహించినట్లు? అంటే తల్లీ, తలుపు తియ్యమ్మా అని పిలవటం ద్వారా!

ఆమె లోపల నుంచే గ్రహించింది ఛత్రచామర ఆందోళికాదులు కూడా చేరువవుతున్నట్లు. ఏం చెయ్యాలి? తలుపు తీయటానికి లేదు. ఎవరో ఆచార్య పురుషులు తమ ఇంటిని పావనం చెయ్యటానికి వేంచేసి నట్లున్నది.

"తల్లీ! యతిరాజులు విజయం చేశారు.

అమ్మా! భాష్యకారులు ముంగిట నిలిచి ఉన్నారు" అంటున్నారు శిష్యులు.

ఆమెకు ఈ మాటలు వినిపించాయి లోపల. ఆమె నిలువెల్లా పులకించిపోయినది. శ్రీ విశిష్టాద్వైత సిద్ధాంతకర్త, జలజపత్రాయత చారులోచనుడు, ద్రావిడామ్నాయ తత్త్వార్థకోవిదుడు, భక్తి మత్కల్ప వృక్షం, శ్రీ వైష్ణవ భక్తాళి నయన చకోర చంద్రుడు-

తన వాకిట నిలిచి ఉన్నారు!

వరదులను పేరు పెట్టి ఆయన పిలుస్తున్నారు. తలుపు తట్టుతున్నారు.

శ్రీరంగశాయి కృపాలవలేశంవల్ల, బహుజన్మకృత పుణ్య పరిపాకంవలన సాక్షాత్తు శ్రీనివాస ప్రభువే తమను కటాక్షించడానికి వచ్చి ఉన్నారు. విలంబనమైతే ఆచార్య పురుషులు శిష్య బృందంతో మరెక్కడికైనా వెళ్ళిపోవచ్చు. జీర్ణవస్త్రంతో ఎలా తలుపు తీసి వారిని సేవించుకోవాలి? ఆమె నిర్విణ్ణురాలైంది. అప్రయత్నంగా మెల్లిగా వాకిలి కొంచెంగా తీసి చేతులు తట్టింది.

ఆమె అవస్థ ఆచార్య స్వామి గ్రహించినట్లుంది. లేత భానుని కాంతిని లేవిడిగొట్టగల కాంతితో విలసిల్లుతున్న తమ మౌళిశాటిని వెంటనే సడలించి ఇంట్లోకి విసిరారు. స్వామి ఉష్ణీషం అది. ఎంత పవిత్రమైనదో?! మాటిమాటికి కళ్ళకద్దుకున్నదామె. కను కొలకుల్లో ఆనంద బాష్పాలు నిలిచాయామెకు. స్వామివారి శాటిని చక్కగా ధరించి ఈవలకు వచ్చి మోకరిల్లింది. అర్ఘ్యపాద్యాలు క్షణంలో సమకూర్చింది.

'యస్య ప్రసాద కలయాబధిరశ్శృణోతి, పంగుః ప్రధావతి' అన్నట్లు, కుంటివాడి దగ్గరకు గంగ పారినట్లు ఆచార్య స్వామి తమంత తాము వచ్చారు తమ పటకుటీరానికి! క్షితిపై వెలసిన శ్రీ మహా విష్ణువే కదా ఆచార్యులంటే? శ్రుతులేమని చెపుతున్నాయి? ఆచార్యులే దైవమని కదా! అర్థము, ప్రాణము ఆచార్యుల పాదాల మ్రోల సమ ర్పించగలవాడే ధన్యుడు కదా! సంసార తరణి గురుదేవుడే కదా అని ఆమెమనసు భక్తి ప్రపత్తులతో నిండిపోయింది. పిడికెడైనా గింజలు లేవే ఈ ఇంట్లో, పది పది హేనుమంది శిష్యులతో వచ్చిన స్వామివారిని సేవించుకునేది ఎట్లా? అని ఆమె మనసు అవశమైపోయింది. చాలా ఆందోళన చెందింది. వారు సమయానికి ఇంట్లో లేరు. ఇంతలో అంతలో వస్తారనే అనుకుందాం. ఆయన తెచ్చే తవ్వెడో, మానెడో గింజలతో ఏమవుతుంది? ఏ విధంగానైనా యతిరాజశేఖరుని అర్చించుకోవాలి. లేకపోతే ఈ జన్మం వ్యర్థమే కదా!

ఆమె మనసులో మెరుపు మెరిసినట్లు ఒక ఊహ తోచింది. ఎంతో భయం కలిగింది. కుప్పకూలిపోతున్న ట్లనిపించినా క్షణంలో తేరుకుంది.

"ఎండ విపరీతంగా ఉంది. మార్గాయాసంవల్ల ఎంతో బడలి ఉన్నారు. దాసురాలు వేగిరం మీ సాపాటు సమకూరుస్తుంది. మీ పాద పాంసువువల్ల మా ఇల్లు పావనమైపోయింది. ఇదుగో, ఇప్పుడే వెళ్ళి, శ్రీవారి దివ్య సన్నిధికి కావలసిన పదార్థాలన్నీ చేకూరుస్తాను" అని వినయంగా అనుజ్ఞ పొందింది.

దృఢమైన సంకల్పంతో ఆమె వడివడిగా అడుగులు వేస్తూ ఊరిలో కల్లా అతి సంపన్నుడైన ఒక వణిక్పుత్రుని గృహం సమీ పించింది. ఆమె కెటువంటి భయాందోళనలు లేవు ఇప్పుడు. సంకోచాలు లేవు. మూడు సంవత్సరాలైంది తను కాపురానికి వచ్చి. అప్పటినుంచీ

ఈ ధనవంతుడు ఎన్నెన్నో ఆగడాలు చేస్తున్నాడు. బాగా అలంక రించుకొని తన విలాసం, సంపద, సొగసు అన్నీ ఒలకబోస్తూ ఇంటి ముందు రధ్యలో వచ్చి ఎన్నిసార్లో తారట్లాడేవాడు. ఒంటిని పూసు కున్న సువాసనలు, తలకు చుట్టిన పూల దండలు గుప్పుమనేట్లు ఇంటి చుట్టూ ప్రదక్షిణలు చేసేవాడు. తరవాత తరవాత ఎన్నెన్నో వర్త మానాలు పంపించాడు. దూతికలను పంపించాడు. అయినా తానొక్క సారైనా అతడివైపు కన్నెత్తి చూడలేదు. అతడు ఊళ్లో చాలా ప్రబ లుడనీ, దుర్మార్గుడనీ, కామాంధుడనీ వాళ్లూ వీళ్లూ అనుకోవటం తాను విన్నది. అయినా ఇప్పుడు తానేం చేస్తున్నది? ఇంత తెగింపా? కూడని పని కదా ఇది? అమితమైన పాపం చేయటం లేదా తాను? అవునో కాదో తనకు తెలియదు. ఇప్పుడు తానవి ఆలోచించగల స్థితిలో లేదు. గురువు వచ్చి ఇంట్లో ఉన్నారు. వారిని అర్చించుకోకుండా ఎట్లా పంపించివేయటం? ప్రత్యక్ష దైవం కాదా పరమ గురువు? తిరుమంగై ఆళ్వారు లేంచేశారు? దారులు కొల్లగొట్టి భాగవతులను అర్చించారా, లేదా? ఆఖరుకు ప్రభువైన శ్రీరంగనాథుడే రాజకుమారుడి వేషంలో పెండ్లి గుంపుగా తరలివెళుతుంటే దారి కాచి పెళ్ళి గుంపునంతా కొల్ల గొట్టి పెళ్ళికొడుకు వేషంలో ప్రభువు ధరించిన వేలి ఉంగరం ఎంతకూ వూడిరాకపోతుంటే ఆలస్యం భరించలేక ఆ వేలును కటుక్కున కొరికి ఆ ఉంగరం సంగ్రహించాడా, లేదా? శ్రీరంగనాథ గోపుర నిర్మాణం కోసం బుద్ధుడి బంగారు విగ్రహాన్ని దొంగిలించాడా, లేదా? పరకాల కవి పుంగవుణ్ణి ఈ దొంగతనం పాపం అంటుతుందా? శ్రీవైష్ణవులను అర్చించడానికే కదా తిరుమంగై యాళ్వారు అన్ని సాహసాలు చేసింది? మంచి చెడ్డలు పరమ పురుషుడే నిర్ణయిస్తాడు కాక అని దిటవు చేసు కొని, ఆ మహా భవనపు విలాస మందిరపు మెట్లు ఒక్కొటొక్కటే ఎక్కి వెళ్ళి విలాస మందిరంలో పట్టుపరుపుల బాలీసులపై ఉస్సు రుస్సురు మంటూన్న ఆ వణిక్పుత్రుడి ఎదుట నిలిచింది.

... దిగ్భ్రాంతి చెందా డతడు. ఇది కలా, నిజమా అని కళవళ పడ్డాడు. ఆమె పెదవుల చిరు నవ్వు వెన్నెలల కాంతికి వెలవెలబోయి నాడు. అట్లానే బొమ్మలా చూస్తూండిపోయినాడు. తన కంటిరెప్ప కూడా వాలని సంగతి గ్రహించనుకూడా లేకపోయినాడు. తాను ఈ రెండేళ్ళలో చిక్కి సగమైనాడు. శరీరమంతా పాలిపోయింది. ఆమె ఒక్కసారి కూడా తనవైపు చూడనేలేదు ఇంతవరకు. రాత్రింబవళ్ళు ఆమె సౌందర్యమనే జ్వాల తనను దహించి వేస్తూనే ఉన్నది. ఆమె ధరించిన తిలకం తనకు మన్మథుడి అస్త్రంలా కనిపించేది. ఎట్లా ఎట్లా అని విసిగి వేసారిపోయినాడు. తాను ఎన్ని ప్రయత్నాలు చేశాడు? ఎంత తాపత్రయం చూపాడు? ఎందరెందరిని రాయబారాలు పంపాడు? అన్నీ కళ్ళ ముందు ఒక్కసారి గిర్రున తిరిగినట్లయింది.

కోకిల తన కలకంఠం సవరించుకొంటున్నట్లుగా మిక్కిలి ముగ్ధంగా, నెమ్మదిగా, నిలకడగా, స్పష్టంగా పెదవి విప్పిం దామె.

"ఓ బేహారీ! నీ కోరిక తీరుతుంది. నేనే నిన్ను ఇప్పుడు అర్థించ డానికి వచ్చాను. మా గురుపాదులు వచ్చి మా ఇంట్లో విడిది చేసి ఉన్నారు. వారి సేవ చేసుకోవటానికి, స్వామికైంకర్యానికి ఇంట్లో సంభారాలేమీ లేవు. కావలసిన పదార్థాలు, పాత్ర సామగ్రి పంపించవల సిందిగా మిమ్ముల్ని ప్రార్థిస్తున్నాను. తలిహను స్వాములు వారికి సమ ర్పించుకొంటాను" అని చెప్పిందామె నిబ్బరంగా. "ఆచార్య పురుషుల మీద వట్టేసి చెపుతున్నాను. ఇవాళ పూర్ణిమ రాత్రి. నేనే స్వయంగా నీ ప్రాసాదానికి వస్తాను" అని చెప్పింది.

ఎన్ని జన్మాల, ఎన్ని పుణ్యాల ఫలమిది! అద్దంలో లిబ్బి స్వయంగా నడిచి వచ్చి చేతికి అందినట్లయిందని అతడు తబ్బిబ్బు పడ్డాడు. నావైపు కన్నెత్తి కూడా చూడని కమలాయతాక్షి ఇప్పుడు

మనసిచ్చి మాట్లాడింది. తన అందమైన ముఖాన్ని క్షణంసేపు కూడా చూడడానికి నోచుకోని నేను దొండపండువంటి పెదవులను ఇందాకటి నుంచీ చూస్తున్నాను. ఆమె స్వయంగా అభిసరించి వస్తానని చెప్పింది. లోకంలో నాభాగ్యమే భాగ్యం. నా జన్మమే జన్మం అని గుక్కిళ్ళు మింగాడు అతడు. ఆ విధంగా ఆమెను ఎదుట నిలిపి ఉంచి తాను మనలే ననుకున్నాడు.

వెంటనే, ఆమె వెంటనే పాలు, పెరుగు, నేతికుండలు, బియ్యం, పప్పు, కూరలునారలు సకల పదార్థాలు పరిచారకులతో పంపించాడు.

క్షణాల మీద ఆ సాధ్వి ఆచార్యుల సన్నిధికి వచ్చి ఆ సమస్త పదార్థాలు ఆయన ముందు సమర్పించి దోసిలొగ్గి నిలిచింది. విస్మితులైనారు యతిరాజశేఖరులు. ఆ తల్లి భక్తికి, జ్ఞానానికి, సాహసానికి, అమిత ధైర్యానికి ఎంతో కరిగిపోయినారు. ఎంతటి ప్రజ్ఞ! ఇన్ని పదార్థాలన్నీ క్షణాలమీద సమకూర్చింది అనుకున్నారు. "అమ్మా! విష్ణువు ఆరాధనకు నీవే ఈ శాకపాకాలు సమకూర్చు ఇవాళ. కావలసి ఉంటే ఈ శిష్యులు నీకు సహాయం వస్తారు. అన్నీ నీ చేతిమీదుగా వండి వార్చి సిద్ధం చేయి, తల్లీ!" అన్నారు.

క్షణాల మీద భక్ష్యభోజ్యాలన్నీ సమకూర్చిందా ఇల్లాలు. మాధ్యాహ్నిక విధులన్నీ తీర్చి ఆరాధనం చేసి శిష్యులతో నపంక్తికంగా ఆ తల్లి వడ్డించగా భుజించి, అమృతంలాగా ఉందమ్మా అని మెచ్చుకొని మార్గాయాసం పరిహరించడానికి ఒకింత విశ్రమించారు భగవద్రామానుజులు.

అవాళ మామూలుకన్నా కూడా కొంచెం పొద్దు ఎక్కింది వరదాచార్యులవారు ఇల్లు చేరడానికి. అపరాహ్ణం దాటింది. వస్తూవస్తూనే యతిరాజులను, శిష్య సంఘాన్ని చూసేసరికి వరదాచార్యులవారి మనసు ఉప్పొంగిపోయింది. పట్టలేని తమకంతో, ఆశ్చర్యంతో, సంభ్ర

మంతో, సంతోషంతో ఉబ్బితబ్బిబ్బవుతూ ఇల్లాలివైపు చూశారాయన. ఆయన్ను చాటుగా తీసుకుని పోయి ప్రీతితో, అతి సాహసంతో తాను చేసిన పని అంతా నెమ్మదిగా చెప్పిందామె.

సంతోషాతిరేకంతో వరదాచార్యులవారి కనుకొలకుల నిండా నీళ్ళు నిలిచాయి. "నీవు నాకు ఇల్లాలివా? నా పాలిటి దేవతవు! నాకు పూజ్యురాలవు నీ వల్ల నా కులమంతా పావనమైంది. ఇటువంటి గాఢ భక్తి, సాహసం ఇంతకుముందెప్పుడైనా విన్నామా, కన్నామా? పరమ దరిద్రుడి పంచలో భాష్యకారులు షడ్రసోపేతమైన రసాన్నాలు భుజించే ఏర్పాటు జరిగిందా? నా పూర్వ పుణ్యం ఎటువంటిదో కదా! నా జన్మ సార్థకమైంది. ఎంత అదృష్టవంతుణ్నో నేను. నీ భర్త కావటం వల్లనే నాకీభాగ్యం కలిగింది. నీవల్ల నాకు విష్ణుసాయుజ్యం సిద్ధం. నా చదువులన్నీ నీవల్ల సార్థకం చెందాయి." అని ఎంతో గౌరవంతో, ఆరాధనా భావంతో చెక్కిళ్ళ వెంట ఆనంద బాష్పాలు స్రవిస్తూ ఉండగా ఒక చేతితో దగ్గరకు చేర్చి ఆమె తలను తన భుజం మీద చేర్చి పరవశించిపోయినాడాయన.

భాష్యకారుల పాదాలు శిరస్సున చేర్చి శ్రీపాదతీర్థం సేవించుకొని ప్రసాదం భుజించి ఆచార్యుల వారి వ్యాఖ్యానాలు వింటూ ఎంతో సేపు కూర్చుండిపోయినాడు.

* * *

పడమటి దిక్కున సంధ్య రాగరంజితమైన నలుపు తిరిగింది. పక్షులు గూళ్ళు చేరుకున్నాయి. చంద్రుడుదయించాడు. ఆకాశం పాలగచ్చులా తళతలా మెరుస్తూంది. అక్కడొకటీ అక్కడొకటీ చుక్కలు మిలమిలలాడుతున్నాయి. పై అంతస్తున చంద్రశాలలో పట్టు పాన్పు పైన చీమ చిటుకుమంటే కళ్ళు విప్పార్చుకొని చూస్తున్నాడు వ్యాపారి. పువ్వుల సెజ్జ అతడికి దుస్సహంగా ఉంది. మిట్ట మధ్యాహ్నపు ఎర్రటి

ఎండలాగుంది అతడి పాలిట వెన్నెల. క్షణమొక యుగంలా ఉంది. తాపంతో వేగిపోతున్నాడు. గుబాళించే మల్లెపూల తావిలో ఉక్కిపోతున్నాడు. గుక్కిళ్ళు మింగుతున్నాడు.

వరదాచార్యుని ఇల్లాలు చల్లని నీట స్నానం చేసింది. పువ్వులు ముడుచుకొంది కొప్పున. వణిజుడు పంపిన నగలు ఒకటి ధరించింది. అతడు పంపిన చీనాంబరం ధరించింది. ఆకాశంపైన చంద్రుడు పదహారు కళలతో వెలిగిపోతుండగా లక్ష్మీదేవి ముఖచంద్రుడు ఖేదంతో కళవలపాటు నొందాడు. ఒక తెల్లని పట్టు సెల్లాను ముఖం కనబడకుండా మేలి ముసుగు ధరించింది. ఒక బంగారు పాత్రలో యతిరాజు భుక్తాన్నశేషం ప్రసాదంగా భద్రపరచింది. శ్రీపాద తీర్థాన్ని వెండి పాత్రలో పోసుకుని బయలుదేరింది. వెంట భర్తను కూడా తోడు చేసుకుని నడిచింది.

ఊళ్లోకల్లా సుందరమైన, ఉన్నతోన్నతమైన మహా భవనాన్ని చేరుకున్నది. సింహ ద్వారం దగ్గర విశాలమైన తిన్నె వద్ద భర్తను నిలిపింది. కక్ష్యాంతరాలు గడచి ఆయాసంతో, అలసటతో విలాసమందిరానికి గొనిపోయే ఒక్కొక్క మెట్టు ఎక్కింది. పండు వెన్నెలలో విరుల పాన్పుమీద ఉస్సురుస్సురుమంటూ సోలుతూ తూలుతూ పర్యంకం మీద కూర్చోలేక సతమతమైపోతున్న కాముకుడు ఆ ఉత్పలనేత్రను చూడగానే ప్రాణాలు యథాస్థానంలో పదిలంగా ఉన్నట్లు సంతోషించాడు.

వెన్నిధిగన్న పేదలా పొంగిపోయినాడు.
సాత్త్వికభావాలు సందడించాయి అతడి గుండెనిండా.
వచ్చావా అని ఎంతో ప్రియంగా, ఎదురుగా నడిచాడు.
వసంత కాలపు కోకిల కలకూజితంలా ఆమె గొంతు విప్పింది.

'ఒక్క-క్షణం వోపిక పట్టండి. నేనిప్పుడు మీ అధీనం. అయినా నేను చెప్పే ఒక్క- సంగతి వినండి. ఈ మేను ఇంతలో ఏమీ కాదు. ఎక్కడికీపోదు రాత్రి అంతా ఇంకా ఎంతో ఉంది. ఇన్నాళ్ళు ఎంత గానో హృదయం చిక్క-బట్టుకున్నావు. వోర్చుకున్నావు. ఒక్క-క్షణం విలంబనంతో మునిగిపోయేదేమి లేదు. కొంచెం సేపైనా మనసుని అదుపులో ఉంచితే మంచిది కదా!

ఇదిగో ఇటు చూసి నా మాట వినండి కాస్త.

శ్రీభాష్యకారుల దివ్యపాదతోయం తీసుకుని వచ్చాను. స్వామి వారి విష్ణుపూజా ప్రసాదం పట్టుకొని వచ్చాను. ఈ తీర్థ ప్రసాదాలు స్వీకరించండి. పరమ గురువులు మన కుగ్రామానికి మాటిమాటికీన్నీ వస్తారా? ఎంతటి అదృష్టమో వారి రాక. మన పూర్వ పుణ్యంవల్ల ఆచార్యపాదులు ఇక్క-డకు విచ్చేశారు. అమృతంకన్నా దుర్లభం శ్రీపాద తీర్థం. ఆచార్య పాదధూళి సమస్త పాపాలు క్షయింపచేస్తుంది. పరమపవిత్రమైన ఈ భగవత్ప్రసాదం వినియోగించండి. ఇది అనితర లభ్యం. శ్రీనివాస కృపావిశేషంవల్ల ఇవాళ మీకిది లభించింది. ఈ సంసార సుఖం ఎప్పుడూ ఉండేది కదా! సంసారమనే సముద్రాన్ని తరించటానికి గురు కటాక్షమే భయంలేని నావకదా! కాబట్టి ముందు ఈ తీర్థ ప్రసాదాలు పుచ్చుకున్న తరువాత" నే నిక్క-డే ఉండి మీ కోరిక తీరుస్తాను, అన్నదామె.

ఆమె మాట లతడిమీద సమ్మోహనాస్త్రంగా పనిచేశాయి. అతని మనసు అవశమైంది. ఒక్క-సారిగా భక్తి భావమేదో నిలువెల్లా పులకింప చేసింది. తీర్థప్రసాదాలు భక్తి శ్రద్ధలతో స్వీకరించాడు అంతే. వెంటనే నాభి నుంచి విద్యుదాఘాతమేదో శరీరంలో ప్రసరించినట్లయింది. క్షణంలోనే జ్ఞానచక్షువులు విప్పారాయి. నిలువెల్లా అపరాధినన్న భావం సందడించింది. పశ్చాత్తాపంతో కన్నీళ్ళు ఉబికివచ్చాయి.

ఫాలతలం నేల సోకగా ఆ తల్లి పాదాల ముందు మోకరిల్లాడు. శరీరమంతా కంపించిపోతూ ఉండగా గద్గద కంఠంతో, కన్నీళ్ళతో ప్రాధేయపడ్డాడు.

"అమ్మా! నన్ను క్షమించు. చేయరాని పాపం చేశాను. నేను పశువును. నీపట్ల మహాపరాధం తలపెట్టాను. చూడమ్మా, పసితనంలో తల్లిదండ్రులు లాలించే సమయంలో నానా అసహ్యం చేస్తారు పిల్లలు. అప్పుడు తల్లి కోపగించుకుంటుందా? పిల్లడిని దండిస్తుందా? అమ్మా, నీ భర్త నాకు తండ్రి. నీవే నా తల్లివి. నాకొక్క సాయం మాత్రం నీవు చేయక తప్పదు. భాష్యకారుల దివ్యపాదపద్మాల దగ్గర నన్ను చేర్చ వలసింది. నన్ను నువ్వు తప్ప ఎవ్వరూ ఉద్ధరించలేరు. నేను చేసిన ఘోరాలకు అంతులేదు. నేయి పోసినకొద్దీ భగ్గుమనే పావక జ్వాలల లాగా నా భోగతృష్ణ మితిమీరి పాపపు పనులు చేశాను నేను ఎన్నెన్నో. యతిరాజ పదసేవ వినా నన్నిప్పుడు రక్షించగల దివ్య ఔషధం లేనే లేదు. నేను నీ దాసుణ్ణి. పుత్రుణ్ణి. నన్ను నీవు తప్ప రక్షించేవాళ్లె వరూ లేరు."

లక్ష్మీదేవి విస్మితురాలైంది. గబగబా వెళ్ళి ఆమె భర్తతో ఈ విచిత్రాన్ని వివరించింది. వరదాచార్యుల ఆశ్చర్యానికి అవధి లేదు. భగవద్రామానుజుల శ్రీపాద తీర్థం ప్రభావం నేను అంచనా వేయ గలనా అనుకున్నాడు.

తన ఇల్లాలి వెంటనే కిందికి దిగి వచ్చిన, ముకుళితకరుడైన ఆ వ్యాపారికి వాగ్దానం చేశాడాయన. మరునాటి ఉదయానే వచ్చి భగవద్రామానుజుల పదసన్నిధి కాతడిని తోడ్కొనిపోతానని కరుణ నిండిన చూడ్కులతో అతణ్ణి దీవించాడు. తన ఇల్లాలు వెంటరాగా నడిచాడు.

* * *

అరుణోదయమైంది. స్నాతుడై శుభవస్త్రాలు ధరించి ప్రాప కుడై వరద దేశికులు ముందు నడువగా అపార ధనరాశులు సేవకులు మోసి తీసుకొనిరాగా పరమపావనమైన వైష్ణవ గృహం చేరాడు వైశ్య కుమారుడు.

పుటం పెట్టిన బంగారంవంటి దేహచ్ఛాయ, ప్రసన్న గంభీర వదన మండలం, ఆకర్ణాంత విశాల నేత్రాలు, ఆజానుబాహువులు- స్వామివారిదివ్యసుందరమధురాకృతి కంటపడగానే చొక్కిపోయినాడు.

ఉదయాచలంపై సూర్యుడిలాగున్నారు స్వామి. అగ్ని దేవుడే ఆకృతి ధరించినట్లున్నారు. బ్రహ్మతేజంతో ప్రకాశిస్తున్నారు. శాంతి మూర్తీభవించినట్లున్నారు. శ్రీనివాసుని దివ్య సింహాసనంవంటి విపుల వక్షంతో విలసిల్లుతున్నారు జ్ఞానాగ్ని నావరించి పైకెగసే ధూమంలాగా స్వామివారి శిఖ వెలుగొందుతూంది. మెరుపు తీగెల్లాగా ఉన్నాయి ఆయన జన్నిదాలు. వేదాంత విద్యా రహస్యాలన్నీ ఆయన శిష్యులకు ఉపన్యసిస్తున్నారు. నిత్య సూరులతో నిండు కొలువుండే సాక్షాత్తు శ్రీనివాస ప్రభువులాగానే ఉన్నారాయన. వాత్సల్య సముద్రమా అన్నట్లు, శాంతి అంతా మూర్తీభవించి ఉన్నట్లు ఆయన చెలువం వహించి ఉన్నారు. విష్ణుభక్తి రూపొంది వచ్చిందా అన్నట్లు కొలువై ఉన్నారు. త్రిదండియై వజ్రపాణి అయిన వాసవుడిలా ఉన్నారాయన. లేత సూర్యకాంతి విడంబించే కావి పుట్టం కట్టి ఉన్నారు. పద్మాసనస్థు డైన బ్రహ్మదేవుడిలా పద్మాసనాసీనుడై భాసిల్లుతున్నారు.

పాషండ మతమనే మహోగ్రారణ్యాని కాయనే కార్చిచ్చు. పర్వత సన్నిభాలైన చార్వాక జైనాది మతాలకు శతధార. బౌద్ధమత మద గజ పంచాననం. మాయావాదాన్ని మటుమాయం చేసినవాడు. పాశుపతాన్ని పారద్రోలినవాడు. కౌమారికుల నోడించిన ప్రోఢ. శ్రీ విశిష్టాద్వైత సిద్ధాంతకర్త. ఊర్ధ్వ పుండ్ర విభూషిత సుందరోజ్జ్వ లాంగుడు. కల్యాణ గుణాకరుడు.

ఆయనను సమీపించి సాష్టాంగ నమస్కారం చేశాడు వ్యాపారి. శుద్దమైన అంతరంగంతో స్తుతించాడు. "నా అజ్ఞానమనే గాడాంధ కారాన్ని తొలగించడానికి విచ్చేసిన సూర్య దేవుడివి నీవు. వేదాంతాబ్ధి మథించి శ్రీభాష్యసుధను ప్రపన్నుల కందించిన మహాప్రభువువు నీవు. వైకుంఠం వదలి వచ్చిన సైన్యనాథుడివి నీవు. అపారమైన దయా దాక్షిణ్యాలతో చేతనులను ఉద్ధరించడానికి తిరుమంత్రం ప్రసాదించిన ధీరుడవు నీవు. ఇన్నాళ్లూ నా జీవితం వ్యర్థమైంది. ప్రవృత్తిచేత పశువును నేను. వేషంచేత మాత్రమే మనిషిని నేను. ఆర్తశరణ్యుడను. నన్ను రక్షించవలసింది" అని వేడుకున్నాడు.

పరమకారుణికుడైన పరివ్రాజక సార్వభౌము దప్పు దాతనికి మంత్రోపదేశం చేసి శిష్యవర్గంలో చేర్చుకున్నాడు.

(ఏభై ఏడు సంవత్సరాల కిందట వెలువడ్డ శ్రీ కొమాండూరు కృష్ణమాచార్యులవారి 'గీతి కథ' ఆధారంగా.)

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక - 1983)